క్లుప్తంగా

అనూషకు డాక్టరేట్



డాక్టరేట్ పొందిన అనూషతో ఆర్ట్స్ కళాశాల బృందం

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల బయో టెక్నాలజీ విభాగం అధ్యాపకురాలు కె.అనూషకు డాక్టరేట్ వచ్చినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు శనివారం తెలిపారు. మత్స్య ఆహారంలో వ్యాధికారక విబ్రియో జాతుల ఆవిర్భావాన్ని ప్రభావితం చేసే సూక్ష్మజీవుల పరస్పర చర్యలు అనే అంశంలో అనూష పరిశోధన చేశారన్నారు. కృష్ణ యూనివర్సిటీ మచిలీపట్నంలో పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారని, ఈ నెల 22వ తేదీన అవార్డు ప్రదానం చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. అనూష కళాశాలలో మహిళా ఎన్‌సీసీ విభాగానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీశైల శాస్త్రి, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథ ప్రచారం

కడియం: కడియపులంక గ్రామంలో త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత గ్రంథంలో అంశాలను ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు శేఖర్ బాబు, పీఎస్ఎన్ మూర్తి, లక్ష్మీనారాయణ, విజయ్, భరత్, రాణి, సంధ్యారాణి, సాత్విక్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

31న బాల బాలికల అథ్లెటిక్ మీట్

ప్రకాశం నగర్: నిడ్జామ్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ ఈ నెల 31వ తేదీన ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో అండర్-14, 16 బాల బాలికల విభాగంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అథ్లెటిక్స్ మీట్ పోస్టర్‌ను ఆదివారం స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ 2023-2024 బాల బాలికల అథ్లెటిక్స్ మీట్ విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాల్సిందిగా కోరారు. నిడ్జామ్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్ రాజేంద్రప్రసాద్, నల్లజర్ల శివ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 31న నిర్వహించే జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ సెలక్షన్స్‌కు రాజమండ్రి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా ఆహ్వానించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ కోచ్‌గా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ నుంచి ఎంపికైన జి.ప్రసాద్ ఆధ్వర్యంలో కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.ప్రసాద్, యూ.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు కృపా సంఘ క్రిస్మస్ క్యారల్స్



రాజవోలులో టోపిలతో క్రిస్మస్ సంతోషం వ్యక్తం చేస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలులోని క్రీస్తు కృపా సంఘం ద్వారా రెవరెండం టాటా విక్టర్, సుగుణ, చర్చి సభ్యులందరరూ ఆదివారం సాయంత్రం క్రిస్మస్ క్యారల్స్ నిర్వహించారు. పాటలు పాడుతూ, చిన్నారుల డ్యాన్స్‌లతో, క్యాండిల్ వెలిగించి, కేక్ కట్ చేసి ముందుగా క్రిస్మస్ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

పంచ చెట్టు గ్రామోత్సవం

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో వెలంపేట రామాలయం వద్ద ఉన్న ఏకాహం ముగింపు సందర్భంగా ఆదివారం సీతారామ పంచ చెట్టుతో గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా తుల్యాభాగీ నదిలో జలాభిషేకం చేసి అనంతరం గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువజన విభాగాల అధ్యక్షులు వీరే

రాజానగరం: నియోజకవర్గంలోని మూడు మండలాలకు వైఎస్సార్ సీపీ యువజన విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు విడుదలయ్యాయి. పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ నియామకాలు జరిగాయి. మండల యువజన అధ్యక్షులుగా సీతానగరానికి కోలా శ్రీను, రాజానగరానికి పిల్లా లక్ష్మీనారాయణ, కోరుకొండకు ఉల్లి గణలను నియమించారు. ఈ పదవులు తమను వరించడానికి ప్రధాన కారకులైన స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికలలో పార్టీ విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.



రాజమహేంద్రవరం పేపర్ మిల్లు వద్ద లూథర్ గిరిలో లూథరన్ చర్చిలో చెట్టుకు స్టార్స్



రాజమహేంద్రవరం జాంపేటలోని లూథరన్ చర్చి



విద్యుత్ కాంతులతో..



ఐఎల్‌టీడీ సెంటర్‌లో ఎలిఫేమియా చర్చి వద్ద వెలుగులు



ఆల్కాట్ గార్డెన్స్ వద్ద గొరిల్లా డైల్ లూథరన్ చర్చి



ప్రభువు రాకడకు వెలుగు పూల స్వాగతం

క్రిస్మస్ కాంతులు

- నేడు ఏసుక్రీస్తు పుట్టినరోజు
- నగరంలో క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి
- విద్యుత్‌కాంతులతో ముస్తాబైన చర్చిలు

సీటీఆర్ఐ: క్రిస్మస్ వేడుకలకు నగరంలోని చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో మిలమిలమెరుస్తున్నాయి. చర్చిలన్నీ ఉదయం నుంచే పరిశుద్ధ ప్రభువు నామంతో మార్మోగనున్నాయి. క్రీస్తు నేడు పుట్టేను హల్లేలోయా అనే నామంతో దైవజనులు ఆదివారం నుంచే తమ ప్రార్థనలు కొనసాగించారు. హోటల్ ఆనంద్ రీజన్సీ వద్ద ఉన్న బైబిల్‌మిషన్ చర్చి, లాలాచెరువు వద్ద ఉన్న మరనాత చర్చి, హోసన్నా చర్చి, క్వారీ సెంటర్ వద్ద క్రిస్ట్ వర్షిప్ సెంటర్, బుచ్చయ్య నగర్‌లోని రాక్ చర్చి, దహించు అగ్ని, లూథరిగిరి చర్చి, బ్రదరన్ చర్చి, క్రీస్తు సంఘం, సీయోను ప్రార్థన మందిరంలో జరిగిన వేడుకల్లో బిషప్‌లు, పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నగరాభివృద్ధికి సహకరించాలి

మీడియాకు ఎంపీ భరత్‌రామ్ విజ్ఞప్తి



వన సమారాధనలో మాట్లాడుతున్న ఎంపీ భరత్ . చిత్రంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, సిటీ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు

ప్రకాశం నగర్: నగరభివృద్ధిలో మీడియా పాత్ర కీలకమని, మీడియా ప్రతినిధులు కుటుంబ సభ్యులు వంటివారని, నిత్యం వారితోనే ఎక్కువగా గడుపుతూ ఉండడ వల్ల అనుబంధం ఎక్కువగా ఉంటుందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని ఆప్కో ఫ్యాబ్రిక్స్ ఎదురుగా ఏఎస్ఆర్ ప్రభు తోటలో రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పార్థసారథి, ఎం.శ్రీరామమూర్తి సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్, రూడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రాజమండ్రి అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గనికృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ నేను పుట్టి పెరిగిన రాజమండ్రి అంటే సహజంగానే మమకారం ఎక్కువ ఉంటుందని, అందువల్లనే రాజమండ్రిని విశ్వ నగరంగా తీర్చిదిద్దాలనేది నా ఆజెండా, ఆకాంక్ష అని తెలిపారు. దానికనుగుణంగా ప్రతి రోజు నగరాభివృద్ధిపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నానని, ఇందుకు మీడియా పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. సీనియర్ జర్నలిస్టు ఎం.శ్రీరామమూర్తి మాట్లాడుతూ రాజమండ్రి నగరాన్ని బహుముఖంగా అభివృద్ధి చేస్తున్న ఎంపీ భరత్ రాజమండ్రి పాత్రికేయులకు ప్రభుత్వ పరంగా నగర పరిధిలో ఇళ్ల స్థలాలు అందించేలా శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ వనసమరాధనలో పలువురు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సాహితీ వేదికలో పుస్తకావిష్కరణలు



పుస్తకాలను ఆవిష్కరించిన సాహితీవేత్తలు

రాజమహేంద్రవరం సిటీ: సాహితీ వేదిక సభ్యుల కవితల సంకలనం చేసిన పలు పుస్తకాలను ఆవిష్కరించే కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం పలువురు సాహితీ వేత్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం గౌతమీ గ్రంథాలయంలో రెండు రోజుల పాటు జరుగనున్న పుస్తకాలు ఆవిష్కరించారు. 'మళ్లీ నది ఒడ్డున' పుస్తకాన్ని తెలుగు వెలుగు డాక్టర్ అరిపిరాల నారాయణరావు ఆవిష్కరించారు. మల్లాప్రగడ రామారావు రచించిన గోరంత దీపం కథల సంపుటికి మళయాల అనువాదం ఓరు తల్లి వెలిచమ్ పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత ఎల్.ఆర్.స్వామి, ప్రసిద్ధ రచయిత, పర్యావరణవేత్త డాక్టర్ తల్లావఝుల పతంజలి శాస్త్రి సంయుక్తంగా ఆవిష్కరించారు. చక్రాల సుబ్బుమహేశ్ రచించిన అంత్యోదయం పుస్తకాన్ని సాహితీవేత్త ఎర్రా ప్రగడ రామకృష్ణ ఆవిష్కరించారు. అంబేడ్కర్ జీవితానికి సంబంధించి ఎవరికి వారు తమ భావాలకు అన్వయించుకుని ఆవిష్కరించేలా మహేష్ రచించిన గేయ రూపకం అంత్యోదయమని విశ్లేషించారు. కల్లూరి భాస్కరం రచించిన 'ఇవీ మన మూలాలు'(జన్యు, భాషా, మత, సాంస్కృతిక వాఙ్మయ ఆధార వెలుగులో భారతీయ మూలాల పరిశీలన) పుస్తకాన్ని డాక్టర్ పతంజలి శాస్త్రి ఆవిష్కరిస్తూ అచ్చమైన తెలుగులో మంచి రచనా శైలి ఈ పుస్తకం కన్పిస్తుందన్నారు. సంస్కృతి మూలాలు, వలసలు వంటి అంశాలతో ఈ పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. సత్య భాస్కర్ పుస్తకం రంగు రంగుల సూర్యుడిని సాహితీ వేదిక కన్వీనర్ కుప్పిలి పద్మ ఆవిష్కరించారు. మల్లాప్రగడ రామారావు, ఎంఎస్ సూర్యనారాయణ, జంధ్యాల శరత్‌బాబు, ఒమ్మి రమేష్, పీవీ కృష్ణారావు, సాధనాల స్వామినాయుడు, నామాడి శ్రీధర్, భమిడిపాటి బాలత్రిపుర సుందరి, శకుంతల దేవి, చల్లా చేశావేణి, లంక సూర్యనారాయణ, నల్లగొండ రవిప్రకాష్, చింతలూరు రాజారామ్ తదితరులు పాల్గొన్నారు. కథల విభాగంలో 2023 సంవత్సరానికి సాహిత్య అకాడమీ జాతీయ పురస్కారానికి ఎంపికైన ప్రసిద్ధ రచయిత, పర్యావరణవేత్త డాక్టర్ తల్లావఝుల పతంజలి శాస్త్రిని సాహితీ వేదిక సభ్యులు అభినందించారు.

అనంతరావుకు ఉత్తమ సేవా అవార్డు



మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అనంతరావు

రాజమహేంద్రవరం రూరల్: ఉత్తమ సేవలందించిన రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు, కన్జ్యూమర్ వాయిస్ అధ్యక్షుడు గొట్టిముక్కల అనంతరావు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అవార్డు అందుకున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన వేడుకలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వినియోగదారుల సేవల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ అవార్డులు అందజేస్తుంటారని, ఈ ఏడాది తనకు ఈ అవార్డును అందించారని అనంతరావు తెలిపారు.

టేబుల్ టెన్నిస్‌లో సత్తా చాటిన సుబ్బారావు



బహుమతి అందుకుంటున్న సుబ్బారావు

ప్రకాశం నగర్: విశాఖపట్నంలో జరిగిన రైల్వే ఇన్‌స్టిట్యూట్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో ఆదివారం జరిగిన స్టేట్ మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో 50 ప్లస్ వ్యక్తిగత విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ క్రీడాకారుడు వీటీవీ సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 ఇయర్స్ డబుల్స్ ఈవెంట్‌లో వీటీవీ సుబ్బారావు, ఎస్.సూర్యప్రకాష్ విజయం సాధించినట్లు చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1973-78 పూర్వ విద్యార్థులు

కడియం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1973-1978లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ చదువుకున్న విద్యార్థులు స్థానిక జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో కలుసుకున్నారు. విదేశ, సుదూర ప్రాంతాలతో పాటు స్థానికంగా ఉన్న పూర్వవిద్యార్థులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సంతోషాన్ని ఒకరికొకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయుడు స్వర్గీయ లక్ష్మీనారాయణ కుమార్తె సంధ్య, అల్లుడు నీలకంఠరావు మాస్టారును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ప్రతిజంటను పూలమాల, శాలువాతో సత్కరించారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం

- ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్



చీరలు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్

కడియం: పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆదివారం కడియంలో సోషల్ మీడియా కో కన్వీనర్ శాకా సురేష్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సురేష్ కేక్ కట్ చేశారు. పేదలకు, వృద్ధులకు పండ్లు, చీరలు చందన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బొల్లినేని హాస్పిటల్, శ్రీసాయిరాం డెంటల్ హాస్పిటల్, ఇంప్లాంట్ సెంటర్ వైద్యులు పరీక్షలు నిర్వహించగా అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బట్టు చిన్ని, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, సాపిరెడ్డి కామేష్, ఊటుకూరి శైలజ, గుత్తుల వాసు, సర్కార్ భాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు దత్త జయంతి

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో దత్త జయంతి వేడుక మంగళవారం జరుగనుంది. వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం ఆలయంలో కొలువై ఉన్న దత్తాత్రేయునికి అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 6.30 గంటల నుంచి గురు చరిత్ర పారాయణను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం హారతి అనంతరం అన్న సమారాధన నిర్వహించి, సాయంత్రం 4.30 గంటలకు రాజానగరం పుర వీధులలో సాయి పల్లకీ ఉత్సవం జరుగుతుంది. భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- గరగలంపాలెంలో ఓవర్‌హెడ్ ట్యాంకు, విద్యుత్ ఇంటర్ లైన్ ప్రారంభం



గరగలం పాలెంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: గ్రామీణ ప్రాంతాలభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గరగలంపాలెంలో రూ.42 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు, రూ.10 లక్షలతో గోపాలపురం నుంచి గరగలంపాలెం వరకూ నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. 36 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు, ఎస్టీ కమ్మర సామాజిక వర్గానికి చెందిన పలువురికి కుల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పేదల కోసం పనిచేస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను అమలు చేసి ఆర్థిక అభివృద్ధిని పెంచారన్నారు. ప్రజలను పట్టించుకొని టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను గెలుపించుకుందామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కన్వీనర్ అడపా కనకరాజు, గరగలం పాలెం సర్పంచ్ బోడపాటి నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆహ్లాద వనం

- అన్ని వసతులతో గాంధీ పార్కు
- రూ.2 కోట్లతో ఆధునీకరణ పనులు
- శరవేగంగా 45 రోజుల్లో పూర్తి చేసేందుకు కృషి



గాంధీ పార్కు ఊహాచిత్రం

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. దీనిలో భాగంగా పార్కులను ఆధునీకరిస్తున్నారు. నగరంలో గాంధీ పార్కు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నగర నడిబొడ్డున సుమారు 2 ఎకరాల స్థలంలో ఉన్న దానవాయిపేట గాంధీ పార్కును రూ.2 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. ఇటీవలే పార్కు ఆధునీకరణ పనులకు ఎంపీ మార్గాని భరత్‌రామ్ శంకుస్థాపన నిర్వహించారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సుమారు 30 పార్కులు నిర్వహిస్తున్నారు. వీటిని అంచెలంచెలుగా ఆధునీకరణ చేపట్టారు. ఇప్పటికే పలు పార్కులను అభివృద్ధి చేసి అందుబాటులోనికి తీసుకువచ్చారు.

ఆకట్టుకునేలా..

గాంధీ పార్కులో అద్భుతమైన ఫీచర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేశారు. పార్కు ముఖ ద్వారాన్ని అందంగా నిర్మించే ఏర్పాటు చేశారు. పార్కులో ట్రీ సిటింగ్, అంబరిల్లా షెల్టర్, క్లాక్ టవర్, మ్యూజిక్ ఎలిమెంట్స్, సిటింగ్ ఏరియా, లైటింగ్, కిడ్స్ ప్లే ఏరియా, షెల్టర్ సిటింగ్, గాంధీ విగ్రహం, వాటర్ ఫౌంటెన్, మౌండ్ సిటింగ్, వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. ప్రహరీని పలు డిజైన్‌తో నిర్మిస్తున్నారు. నగరంలో అత్యాధునిక వసతులతో తయారు చేస్తున్న ఈ పార్కు నగర ప్రజలకు ఆనందాన్ని ఆహ్లాదాన్ని అందించనుంది. చిన్నారుల నుంచి అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా పార్కును సిద్ధం చేస్తున్నట్లు నగర పాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. పార్కు నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధతో నిర్మాణాలు చేపట్టినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

45 రోజుల్లో అందుబాటులోకి తెస్తాం



ఆధునీకరిస్తున్న దానవాయిపేట గాంధీ పార్కును 45 రోజుల్లో ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తాం. ఇప్పటివరకూ ఏ పార్కులోని ఏర్పాటు చేయని అధునాతన వసతులు ఏర్పాటు చేస్తున్నాం. పనులు శరవేగంగా జరగుతున్నాయి. పూర్తి నాణ్యతతో పారదర్శకంగా నిర్మాణం చేపడుతున్నాం. ఆధునీకరణతో పాటు పచ్చదనానికి ప్రాధాన్యత కల్పిస్తున్నాం. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు ప్రత్యేక వేదిక కానుంది.

– దినేష్‌కుమార్, కమిషనర్, నగర పాలక సంస్థ





శరవేగంగా జరుగుతున్న పార్కు నిర్మాణ పనులు

సాక్షి- సినిమాలు



శ్యామల:	సలార్
సూర్యమినీ:	డంకీ,ఆక్వామేన్
సూర్యప్యాలెస్:	సలార్
స్వామి:	హాయ్‌నాన్న
శివజ్యోతి:	సలార్
అనుశ్రీ:	సలార్
అశోక:	సలార్
ఊర్వశి:	పిండం,యానిమల్
రంభ:	సలార్
మేనక:	ఆక్వామేన్
అప్సర:	సలార్
నామవరం:	
వీఎస్.మహల్:	సలార్
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ:	సలార్
కడియం:	
వెంకటసూర్య:	సలార్